అందుబాటులో స్టెమీ ఇంజెక్షన్

ప్రజాశక్తి - ఆచంట

ఆచంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రూ.45 వేలు విలువైన స్టెమీ (టెనెక్ట్ ప్లస్) ఇంజెక్షన్ ఉచితంగా అందుబాటులో ఉందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆ ఆసుపత్రి వైద్యాధికారి డి.జితేంద్ర తెలిపారు. సోమవారం స్టెమీతో గుండెకు భరోసా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జితేంద్ర మాట్లాడుతూ ఛాతి నొప్పి, ఎడమ భుజం లాగడం, ఆకస్మికంగా ఆయాసం, గుండెల్లో దడ, స్పృహ కోల్పోవడం వంటి లక్షణాలను గుర్తించిన గంటలోపు సమీపంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తీసుకొస్తే విలువైన ఇంజెక్షన్ చేసి మనిషి ప్రాణాన్ని కాపాడగలుగుతామని ఆయన వివరించారు. పై లక్షణాలు కలిగిన వారు 108కు ఫోన్ చేస్తే వారు వెంటనే సమీప ఆస్పత్రికి తరలిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'కోడ్' లేదు.. సలాంలే..!

టిడిపి అభ్యర్థి నామినేషన్‌లో నిబంధనలు బేఖాతరు

కలెక్టరేట్ గేటు వరకు వందలాది మంది టిడిపి నేతలు, కార్యకర్తలు

కలెక్టరేట్ లోపలికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, అనుచరులు 22 మందిపైనే

ప్రభుత్వ అధీనంలోని ఇండోర్ స్టేడియంలో వేలాది మందికి భోజనాలు

సలాం కొడుతూ చేతులెత్తేసిన పోలీసులు, అధికారులు

కలెక్టరేట్ గేటు వద్దకు చేరుకున్న కూటమి నాయకులు, కార్యకర్తలు

ముగ్గురితో నామినేషన్ వేసేందుకు వెళ్తున్న పిడిఎఫ్ అభ్యర్థి రాఘవులు (ఫైల్)

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అధికార పార్టీ ఎంఎల్‌సి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం నామినేషన్ ప్రక్రియలో పోలీసులు, అధికారులు సలాం కొడుతూ, ఎన్నికల నిబంధనలను గాలికొదిలేశారు. ఎన్నికల నిబంధనలకు పాతరేస్తూ మంత్రులు, ఎంఎల్‌ఎలు, టిడిపి నేతలు వ్యవహరించిన తీరు అందరినీ విస్మయానికి గురిచేసింది. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి కూటమి అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం సోమవారం నామినేషన్ వేశారు. ఈ నామినేషన్ ప్రక్రియలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన సాగింది. నిబంధనలు ఇతర పక్షాలకేగాని, అధికారపక్షానికి వర్తించవు అన్నట్లుగా పోలీసులు, అధికారులు చేతులెత్తేసిన కన్పించింది. స్థానిక అమీనాపేటలోని టిడిపి కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. నిబంధనల ప్రకారం నామినేషన్ వేసే కలెక్టర్ కార్యాలయానికి వంద మీటర్ల దూరం వరకు మాత్రమే నాయకులు, కార్యకర్తలకు అనుమతి ఉంటుంది. అక్కడి నుంచి అభ్యర్థితోపాటు మరో నలుగురిని మాత్రమే కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు అనుమతిస్తారు. ఇప్పటి వరకూ నామినేషన్లు వేసిన అభ్యర్థులంతా ఇవే నిబంధనలు పాటించేలా పోలీసులు కట్టుదిట్టంగా వ్యవహరించారు. చివరి రోజు సోమవారం అధికారపక్ష అభ్యర్థి విషయంలో నాయకులను అదుపు చేయకుండా పోలీసులు చేతులెత్తేశారు. వంద మీటర్ల వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్‌లు దాటి కలెక్టరేట్ గేటు వద్దకు సుమారు 500 మంది కార్యకర్తలు, నాయకులు చేరుకున్నారు. గేటుదాటి కలెక్టరేట్లోకి దాదాపు 22 మంది వరకూ వెళ్లిన పరిస్థితి ఉంది.

నిబంధనలు బేఖాతర్ చేసిన మంత్రులు, ఎంఎల్‌ఎలు

రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు, కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి రాధాకృష్ణయ్య (చంటి)తోపాటు గోదావరి జిల్లాలకు చెందిన పలువురు ఎంఎల్‌ఎలు ఎన్నికల నిబంధనలను ఏమాత్రం పట్టించుకోలేదు. వంద మీటర్ల వద్ద నాయకులను, కార్యకర్తలను అదుపుచేయాల్సిన పోలీసులు ప్రేక్షకపాత్రకు పరిమితమయ్యారు. డిఎస్‌పి స్థాయి అధికారి సైతం ఏమి చేయలేకపోయారు. కలెక్టరేట్ గేటు దాటి 20 మందికిపైగా లోపలికి వెళ్లడంతోపాటు నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్ ఫొటోగ్రాఫర్లు కలెక్టరేట్ కాంపౌండ్‌లో డ్రోన్ కెమెరా ఎగరవేసినప్పటికీ పోలీసులు మౌనంగా ఉండిపోయారు. ఒక ఎఎస్‌పి, ఒక డిఎస్‌పి స్థాయి అధికారులతోపాటు పలువురు సిఐలు, ఎస్‌ఐలు ఉన్నప్పటికీ ఎన్నికల నిబంధనలను అమలు చేయడంలో విఫలమయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా పార్టీ కార్యక్రమాలకు ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు ఉపయోగించకూడదని నిబంధనల్లో ఉంది. అయినప్పటికీ ఇండోర్ స్టేడియం మైదానంలో సుమారు ఆరు వేల మందికి భోజన ఏర్పాట్లు చేయడం గమనార్హం. జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని నిర్మాణంలో ఉన్న భవనంలో మాజీ ఎంఎల్‌ఎ బడేటి చంటి ఫొటోతో కూడిన ఫ్లెక్సీలు పెట్టి మరీ అల్పాహారం, భోజనం ఏర్పాట్లు చేయడం గమనార్హం. టిడిపి కార్యాలయం వద్ద రోడ్లపై ఫ్లెక్సీలు నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేయడం చూస్తుంటే నిబంధనలు అధికార పక్షానికి వర్తించవా అనే ప్రశ్న తలెత్తుతోంది. మూడు రోజుల క్రితం పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థి డివి.రాఘవులు నామినేషన్ కార్యక్రమంలో అనేక ప్రజాసంఘాల నాయకులు ర్యాలీగా పాల్గొన్నప్పటికీ కేవలం ఐదుగురిని మాత్రమే కలెక్టరేట్లోకి పంపించారు. ఈ నిబంధన అధికార పార్టీ అభ్యర్థి విషయంలో ఎందుకు అమలు చేయలేకపోయారో ఉన్నతాధికారులే చెప్పాలి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఎన్నికల నియమావళి కచ్చితంగా అమలయ్యేలా చూడాలని అంతా కోరుతున్నారు.

ఇండోర్ స్టేడియంలో భోజనాలు

జెడ్‌పిలో మాజీ ఎంఎల్‌ఎ బడేటి బుజ్జి ఫ్లెక్సీలతో చేసిన భోజన ఏర్పాట్లు



కలెక్టరేట్‌లో డ్రోన్

ముగిసిన నామినేషన్ల పర్వం

పట్టభద్రుల ఎంఎల్‌సి నామినేషన్లకు ముగిసిన గడువు

మొత్తం 49 మంది అభ్యర్థులు, 72 నామినేషన్లు

నేడు నామినేషన్ల పరిశీలన.. 13 వరకూ ఉపసంహరణకు గడువు

27న ఎన్నికలు, 3న కౌంటింగ్

పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

నామినేషన్ పత్రాలు అందిస్తున్న కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల నామినేషన్ల పర్వం సోమవారంతో ముగిసింది. జనవరి 29న ఎంఎల్‌సి ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. ఫిబ్రవరి మూడో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. అదేరోజు నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. పదోతేదీ సోమవారం సాయంత్రం నామినేషన్ల స్వీకరణ ముగిసింది. ఎంఎల్‌సి ఎన్నికల రిట్నరింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి నామినేషన్లను స్వీకరించారు. నామినేషన్ల గడువు ముగిసేసరికి మొత్తం 49 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కొంతమంది అభ్యర్థులు రెండేసి చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. ఏడో తేదీ శుక్రవారం, చివరిరోజు సోమవారం అత్యధిక నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల స్వీకరణ ముగియడంతో 11వ తేదీ మంగళవారం నామినేషన్ల పరిశీలన జరగనుంది. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీతో గడువు ముగియనుంది. ఉపసంహరణల గడువు ముగిసిన తర్వాత బరిలో ఎంతమంది నిలిచారో అభ్యర్థుల జాబితా తేలనుంది. ఈ నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ పోలింగ్ జరగనుంది. మార్చి మూడో తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఏలూరులో నిర్వహించనున్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 3,15,261 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. మొత్తం 440 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. అవసరాన్ని బట్టి పోలింగ్ కేంద్రాల పెంపునకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

పిడిఎఫ్, టిడిపి అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ బలపరిచిన అభ్యర్థి దిడ్ల వీర రాఘవులు, టిడిపి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. నిరుద్యోగులు, ఉద్యోగ, కార్మికులంతా పిడిఎఫ్ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నారు. టిడిపి తన అధికార బలాన్ని ఉపయోగించి ఎంఎల్‌సి ఎన్నికల్లో గెలుపొందాలని చూస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రులు, ఎంఎల్‌ఎలు, స్థానిక నాయకులంతా తమ సర్వశక్తులు ఒడ్డుతున్న పరిస్థితి ఉంది. టిడిపి అభ్యర్థి నామినేషన్ రోజున నిబంధనలు లెక్కచేయకుండా ముందుకు సాగడంతో ఎన్నికలు దగ్గర పడే కొద్ది పరిస్థితి ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది. ఏదేమైనా ఎంఎల్‌సి ఎన్నికలు రసవత్తరంగా సాగే పరిస్థితి కన్పిస్తోంది.

నులిపురుగుల నివారణతో రక్తహీనత దూరం

జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

మాత్రలు వేసుకుంటున్న విద్యార్థులు

జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలో శ్రీ పొట్టి శ్రీరాములు పురపాలక బాలికోన్నత పాఠశాలలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. తొమ్మిదో తరగతి విద్యార్థులతో బెంచిపై కలిసి కూర్చుని ఆప్యాయంగా పలకరించారు. విద్యార్థులు అందరితో ఒకేసారి నులి పురుగుల నివారణ మాత్రలను వేసుకునేలా ఉత్తేజపరిచి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు బయట అమ్మే పానీ పూరీలు, నూడిల్స్, వివిధ రకాల తినుబండారాలను అస్సలు తినకూడదని సూచించారు. వీలైనంత ఎక్కువగా ఇంటి వద్ద అమ్మ చేసిన వంటకాలను తినాలన్నారు. నులిపురుగులు ప్రమాదకరమైనవని తెలిపారు. వీటివల్ల రక్తహీనతతోపాటు అనేక రకాల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. 19 సంవత్సరాల వయస్సులోపు కలిగిన పిల్లలందరూ తప్పనిసరిగా నులిపురుగుల నివారణ మాత్రను వేసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సంవత్సరంలో రెండుసార్లు ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో ప్రభుత్వం నిర్వహిస్తుందని చెప్పారు. ఎక్కువగా ఆడపిల్లలు రక్తహీనతతో బాధపడుతుంటారన్నారు. రక్తహీనత వల్ల చదువుపై ఏకాగ్రత చూపలేరని, ఆటల్లోనూ చురుగ్గా ఉండలేరని తెలిపారు. ఐరన్ శాతం ఎక్కువ ఉండే ఆకుకూరలు, వేరుశెనగ, నువ్వుల ఉండలు వంటివి ఆహారంగా తీసుకుంటే అన్ని విధాలా పని చేయగలిగే శక్తి సామర్థ్యాలు కలుగుతాయన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల పిల్లలు నులిపురుగుల నివారణ మాత్రలు వేసుకునేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జెసి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ సిహెచ్.భావన, డిఎంహెచ్‌ఒ డాక్టర్ బి.భానునాయక్, డిఇఒ ఇ.నారాయణ, జిల్లా స్త్రీ శిశుసంక్షేమ శాఖాధికారి సుజాతరాణి, మధ్యాహ్న భోజన పథకం కోఆర్డినేటర్లు కె.కృష్ణారావు, హెచ్‌ఎం విఎం.రాధాకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేశవరం వంతెనకు మరమ్మతులు చేయండి

కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టండి

వంతెన వద్ద ప్రజలు, విద్యార్థుల ఆందోళన

ప్రజాశక్తి - గణపవరం

వంతెన వద్ద ఆందోళన చేస్తున్న ప్రజలు, విద్యార్థులు

ఉండి కాల్వపై కేశవరం వెళ్లడానికి నిర్మించిన బెయిలీ వంతెన శిథిలావస్థకు చేరిందని, దానికి తక్షణం మరమ్మతులు చేపట్టడంతోపాటు పక్కా వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఆ గ్రామస్తులు, విద్యార్థులు పెద్దసంఖ్యలో సోమవారం వంతెన వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ 2008లో కేశవరం వంతెన కూలిపోయిందని, దీంతో అధికారులు తాత్కాలికంగా బెయిలీ వంతెన నిర్మించారని తెలిపారు. 2019లో అప్పటి మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు నూతన వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారన్నారు. 2022లో తాత్కాలిక వంతెన మరమ్మతుల నిమిత్తం రూ.9 లక్షలు కేటాయించారని, వీటికి సంబంధించిన శిలాఫలకాలు ఇరుపక్కలా ఉన్నా వంతెనపై మాత్రం రాకపోకలకు అనువుగా లేదని అన్నారు. బెయిలీ వంతెన రేకులు ఊడిపోవడం వల్ల వాహనాల టైర్లు తెగి జనం నానావస్థలు పడుతున్నారని తెలిపారు. విద్యార్థులు సైకిళ్లపై వంతెన దాటడానికి భయపడుతున్నారని చెప్పారు. సంక్రాంతి సందర్భంగా కార్లు వెళ్లేందుకు పొక్లెయిన్ రబ్బర్లు వేశారని, పండుగ అవ్వగానే వాటిని తీసివేశారని తెలిపారు. ఇప్పటికైనా స్థానిక ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు బెయిలీ వంతెనకు మరమ్మతులు చేసి కొత్త వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంత నేతలు మేడిశెట్టి పెంటారావు, పెచ్చెట్టి నరసింహమూర్తి మాట్లాడుతూ వంతెనకు పడిన రంధ్రాల్లో పాదచారులు, వాహనదారులు పడి గాయాల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణం బెయిలీ వంతెనకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కేతా శ్రీను, సోడదాసి సంజీవరావు, పివిఆర్.సుబ్రహ్మణ్యం, నరాలశెట్టి రామకృష్ణ, పట్నాల అంజి, సప్పా సూరిబాబు, ఏసు, పి.త్రిమూర్తులు, సోమరాజు, యాళ్ల అప్పారావు పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు

ఘనంగా కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

మాట్లాడుతున్న కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ నాయకులు

అసంఘటిత రంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కూరగాయల మార్కెట్ జట్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) 33వ వార్షికోత్సవం స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో గొర్రెల సతీష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ప్రజా కళాకారులు షేక్ వలీ, రంగా, పోతు శ్రీను గీతాలాపన చేయగా యూనియన్ సీనియర్ నాయకులు నక్కా ఆనందరావు సిఐటియు పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యకలాపాల నివేదికను కార్యదర్శి బత్తిన సత్యనారాయణ ప్రవేశ పెట్టగా సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు మంచం కోళ్ళ లా తయారుచేసి లేబర్ కోడ్‌ల పేరుతో కార్మికులను కట్టుబానిసుల్లా మార్చేందుకు సిద్ధమైందని ఆందోళన వ్యక్తం చేశారు. లేబర్ కోడ్‌లు కార్మికుల ప్రయోజనాలను పూర్తిగా దెబ్బతీయనున్నాయన్నారు. కార్మికుల జన్మ హక్కుగా భావించే సమ్మె హక్కును నిర్వీర్యం చేస్తుందని, యూనియన్ పెట్టుకోకుండా చేస్తుందని తెలిపారు. ఉన్న హక్కులను కాలరాసే మోడీ ప్రభుత్వ విధానాలను తీవ్రంగా ప్రతిఘటించాలన్నారు. అంబానీ అదానీలకు దేశ సంపదను కట్టబెట్టేలా మోడీ ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. సిఐటియు పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రభుత్వరంగాన్ని పూర్తిగా ప్రయివేటీకరిస్తుందని, ఈ విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలు అమలు చేయాలని, లేనిపక్షంలో దశలవారీగా ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నేతలు సత్తి కోదండ రామిరెడ్డి, నరమాల కృష్ణ, కుంచంగి నానాజీ, వడిసెల శ్రీను తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.

అధ్యక్షులుగా గొర్రెల సతీష్‌కుమార్, కార్యదర్శిగా బత్తిన నాగ సత్యనారాయణ, కోశాధికారిగా యాసరపు పైడన్న, కమిటీ సభ్యులుగా లచ్చిపతుల శ్రీను, నౌడు బాలాజీ, నాగిరెడ్డి సాయితేజ, బొబ్బిలి కొండలరావు, రాచర్ల శివ ఎన్నికయ్యారు.

పెనుమంట్రలో కోడ్ ఉల్లంఘన

ఇఒపిఆర్‌డి కార్యాలయం బయట ముసుగువేయని శిలాఫలకం

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఎంఎల్‌సి ఎన్నికల నేపథ్యంలో ఎలక్షన్ కోడ్ అమలులో ఉండగా పలుచోట్ల కోడ్ ఉల్లంఘన జరుగుతుందని స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. మండల కేంద్రంలోని ఇఒపిఆర్‌డి కార్యాలయం బయట ఉన్న శిలాఫలకానికి ముసుగు వేయకుండా వది లేశారు. ఇలా మండలంలో పలుచోట్ల ఉన్నా.. సంబంధిత అధికారులు పట్టనట్లు వదిలేయడం పట్ల పలువురు నిరసన తెలుపుతున్నారు.

వినూత్న ఆవిష్కరణలకు కేంద్రం నిట్

ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ రమణారావు



శాస్త్రవేత్తలను సత్కరిస్తున్న ప్రొఫెసర్ రమణారావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అంటే ఒక విద్యా సంస్థ మాత్రమే కాదని, పరిశోధనలు, వినూత్న ఆవిష్కరణలకు కేంద్ర బిందువు అని ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్, డాక్టర్ ఎన్‌వి.రమణారావు తెలిపారు. నిట్ ప్రాంగణంలోని సర్వేపల్లి రాధాకృష్ణన్ భవన సముదాయంలో భారత ప్రభుత్వ ఆధీనంలోని డిపార్ట్మెంట్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్(డిఎస్‌ఐఆర్) రూ.7.50 కోట్ల ఆర్థిక సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన డిఎస్‌ఐఆర్-కామన్ రీసెర్చ్ టెక్నాలజీ డెవలప్మెంట్ హబ్‌ను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేలా పునరుత్పాదక శక్తి వనరులు, విద్యుత్ రంగాల్లో ఆవిష్కర్తలు, నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలన్నారు. ఎవరైతే ఎక్కువ సమయాన్ని ప్రయోగశాలకు కేటాయిస్తారో వారికి కొత్త కొత్త ఆలోచనలు పుట్టుకొస్తాయని చెప్పారు. పరిశోధనా ఫలాలను క్షేత్రస్థాయికి తీసుకెళ్లటమే ఆవిష్కర్తల పరిశోధన కృషికి, నిబ్బద్ధతకు కొలమాణమని సూచించారు. రూ.7.50 కోట్ల ప్రాజెక్ట్‌ను ఎపి నిట్‌కి తీసుకురావటానికి కృషిచేసిన ఆచార్యులు డాక్టర్ సందీప్, డాక్టర్ శంకర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రొఫెసర్ రమణారావు, శాస్త్రవేత్తలు కైలాస్ పెట్కర్, రంజిత్ భైర్వాను ఆచార్యులు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా డైరెక్టర్, డిఎస్‌ఐఆర్ శాస్త్రవేత్తలు హబ్‌ను పరిశీలించి పరిశోధన పరికరాల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జిబి.వీరేష్ కుమార్, విభాగాధిపతులు డాక్టర్ టి.రమేష్, డాక్టర్ రఫీ మహమ్మద్, డాక్టర్ వినోత్ కుమార్ రాజా పాల్గొన్నారు.

పింఛను సొమ్ము స్వాహా !

అయోధ్యలంక పంచాయతీ కార్యదర్శి నిర్వాకం

ఆచంట : లబ్ధిదారులకు పంపిణీ చేయవలసిన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ సొమ్మును గ్రామపంచాయతీ కార్యదర్శి స్వాహా చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వం ప్రతినెల ఎన్‌టిఆర్ భరోసా పథకం కింద లబ్ధిదారులకు ప్రతినెల 1వ తేదీన పింఛన్లు పంపిణీ చేస్తుంది. ఇందులో భాగంగా ఆచంట ఎంపిడిఒ అయోధ్య లంక గ్రామపంచాయతీ పరిధిలోని లబ్ధిదారుల పింఛన్ సొమ్మును పంచాయతీ కార్యదర్శి పి.సోమేశ్వరరావుకు అప్పగించారు. అయితే గ్రామపంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు డ్వాక్రా సిఎ నలుగురు లబ్ధిదారుల నుంచి వేలిముద్రలు తీసుకుని వారికి అందించవలసిన రూ.16,500లు పంపిణీ చేయలేదు. లబ్ధిదారులు పింఛన్ సొమ్ము గురించి ప్రశ్నించగా గ్రామ పంచాయతీ కార్యదర్శి మీ అకౌంట్లకు జమ చేస్తారని ఆమె తెలిపారు. అయితే రోజులు గడుస్తున్నా పింఛన్ సొమ్ము ఆ నలుగురు లబ్ధిదారులకు అందకపోవడం, ఈనెల ఐదో తేదీ నుంచి గ్రామ కార్యదర్శి ప్రజలకు అందుబాటులో లేకపోవడం, ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో గ్రామస్తులు, లబ్ధిదారులు కలిసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ఎంపిడిఒ వి.పూర్ణ బాబ్జి ఈనెల 7వ తేదీన గ్రామంలో పర్యటించి విచారించారు. ఈ సందర్భంలో వేలిముద్రలు వేయించుకున్న సొమ్ములు అందలేదని లబ్ధిదారులు గొగ్గోలు పెట్టారు. కార్యదర్శి కూడా గత కొద్ది రోజుల నుంచి గ్రామంలోకి రావడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై డ్వాక్రా సిఎను ఎంపిడిఒ విచారించగా పంచాయతీ కార్యదర్శి ఆదేశాల మేరకు తాను ముద్రలు వేయించుకుని సొమ్ములు పంపిణీ చేయలేదని, కార్యదర్శి లబ్ధిదారులకు నేరుగా అందిస్తానని తెలిపారన్నారు. విచారణలో గ్రామ కార్యదర్శి పింఛన్ పంపిణీలో అవకతవకలు చేసినట్లు గుర్తించారు. నలుగురు లబ్ధిదారులకు అందించవలసిన రూ.16,500తో పాటు మిగిలిన పింఛన్ సొమ్ము రూ.54,500 కూడా కార్యాలయానికి కార్యదర్శి అప్పగించలేదని ఎంపిడిఒ విలేకరులకు తెలిపారు. పింఛన్ సొమ్ము దుర్వినియోగం చేసిన గ్రామ కార్యదర్శి పి.సోమేశ్వరరావుపై తదుపరి చర్యలకు ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని, చర్యలు ఉంటాయని ఎంపిడిఒ తెలిపారు.

రైతులకు బహుళార్థసాధక కార్డులు : జెసి

ఆకివీడు : ఆధార్ కార్డు తరహాలో ప్రతి రైతుకి బహుళార్థసాధక కార్డులను అందజేయాలని ప్రతిపాదన ఉన్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మండలంలో రీ సర్వే పైలట్ గ్రామమైన గుమ్ములూరులో సర్వే సిబ్బంది నిర్వహిస్తున్న రైతు చాపల చెరువు రీ సర్వేని పరిశీలించారు. అడంగల్లు వన్‌బి ఎల్‌పిఎ నెంబర్లు, సబ్ డివిజన్ అంశాలపై సర్వే సిబ్బందితో చర్చించారు. ఈమేరకు ఆయన పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రీసర్వేకు దరఖాస్తులు వచ్చి సర్వే నిర్వహించవలసిన చోట సమస్యాత్మకమైన భూ యజమానికి తప్పనిసరిగా నోటీసులు అందజేయాలని సూచించారు. మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకున్నప్పుడు పేర్లు పూర్తిస్థాయిలో సరిగా ఉన్నవి లేనిదీ చూసుకోవాలి. వాటితో పాటు ఆధార్ కార్డు ఆధారంగా పేరు, ఇతర వివరాలు సరి చూడాలన్నారు. రైతు భూ విస్తీర్ణం పేరు, సర్వే నెంబరు వంటి ఇతర వివరాలు సైతం ఒక్కసారిగా సరిచేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 20 మండలాల్లో మండలానికి ఓ గ్రామం చొప్పున పైలట్ గ్రామంగా ఎంపిక చేసి రీసర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికే గణపురంలో ముప్పర్తిపాడు, ఇరగవనంలో పొదలాడ గ్రామాలలో రైతులతో సమావేశాలు పూర్తయ్యాయన్నారు. ఇక మిగిలిన గ్రామాలలో రైతుల నుంచి సమాచారం సేకరించి కార్యక్రమం జరుగుతోందన్నారు. జిల్లా మొత్తంలో 93 టీంలు పనిచేస్తున్నాయని, ప్రతి టీంకు ఒక విఆర్‌ఒ, ఇద్దరు విలేజ్ సర్వేయర్లు ఉంటారని ఆయన చెప్పారు. జనవరి 20వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం త్వరలో పూర్తి చేస్తామన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పాలకొల్లు : గత 5 నెలల్లో సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పాలకొల్లు నియోజకవర్గంలో రూ.కోటి 80 లక్షలు పేద రోగులకు అందించినట్లు మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఆయన కార్యాలయంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన 10 మందికి రూ.11 లక్షల సిఎంఆర్ చెక్కులను బాధితులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత 5 సంవత్సరాలలో పేదల వైద్యాన్ని నీరుగార్చింది జగన్ ప్రభుత్వం అన్నారు. జగన్‌కు ప్రతిపక్ష హోదా ఇవ్వవలసింది తాము కాదని ప్రజలని అన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్ నాడు చిన్నాభిన్నం చేస్తే నేడు చంద్రబాబు కష్టమైన అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన అందిస్తున్నారన్నారు. పేదల గుండెకు భరోసా కింద గుండె జబ్బు వస్తే రూ.60 వేల విలువ గల ఇంజక్షన్ కూడా ఉచితంగా అందిస్తున్నాం అని తెలిపారు. వీటిని అన్ని వైద్య, ఆరోగ్య ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచామన్నారు. మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్, కూటమి నేతలు పాల్గొన్నారు.

'రక్తదానం ప్రాణదానంతో సమానం'

భీమవరం టౌన్ : రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎస్‌ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఉపాధ్యక్షులు ఎవి.రంగరాజు పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. క్రీడాస్ఫూర్తి సాగి రామకృష్ణంరాజు పేరిట నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో సుమారు 150 యూనిట్ల రక్తాన్ని ట్రస్ట్, ఏవిఎస్.గంగా చారిటబుల్ ట్రస్ట్ బ్లడ్ బ్యాంకు సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ వివిధ సందర్భాల్లో పెద్ద ఎత్తున రక్తదానం చేసి తమ విద్యార్థులు ఎందరికో ప్రాణదానం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ కెవిఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున రక్తదానం చేసేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఐటీ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.రవి కిరణ్ వర్మ, వివిధ బ్రాంచుల‌కు చెందిన అసిస్టెంట్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు, అధ్యాపకులు, విద్యార్థి కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలి

అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ తేజ

భీమవరం టౌన్ : విద్యార్థులందరూ రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు క్రమశిక్షణతో ఉండాలని, ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎ.తేజ అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా సోమవారం భీమవరం పివిఎస్ హైస్కూల్లో విద్యార్థులకు రోడ్ సేఫ్టీ పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తేజ మాట్లాడుతూ విద్యార్థులు 18 ఏళ్ల వయసు నిండకుండా మోటార్ వాహనాలు నడపవద్దని, నడిపిన ఎడల వారే కాకుండా వారి తల్లిదండ్రులు కూడా శిక్షార్హులు అవుతారని అన్నారు. రవాణా శాఖ వైద్యాధికారిణి డాక్టర్ హనుమ లక్ష్మి, ఆర్‌డిఓ సిబ్బంది కోటి, హైస్కూల్ హెచ్‌ఎం వారణాసి రాధాకృష్ణ మాట్లాడుతూ స్కూల్ బస్ డ్రైవర్లు అందరూ వాహనం నడిపేటప్పుడు సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని సూచించి ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రథమ చికిత్సలపై వివరించారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించి, రోడ్డు ప్రమాదాలు-భద్రతపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన వారికి 15వ తేదీన బహుమతులు అందజేస్తామని తెలిపారు.

'ప్రతాప్ నాయుడు కృషి ఎనలేనిది'

నరసాపురం : వశిష్ట దివ్య జ్ఞాన సమాజం ఆధ్వర్యంలో బందారు వీర సూర సత్య ప్రతాప్ నాయుడు సంస్మరణ సభ సరిపల్లి గ్రామంలో మాధవ నాయుడు నివాసంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎంఎల్‌ఏ బందారు మాధవ నాయుడు, తెలుగు ఫెడరేషన్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు బందారు మాధవ నాయుడు మాట్లాడుతూ మా తండ్రి తన స్వగ్రామంలో అందరితో ఒక్కడిగా మెలిగేవారని అన్నారు. సరిపల్లి గ్రామ అభివృద్ధి కోసం ఎప్పుడూ తాపత్రయ పడేవారని అన్నారు. దివ్య జ్ఞాన సమాజం సభ్యులు మాట్లాడుతూ సరిపల్లి గ్రామ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అన్నారు. కర్రి సీతా రామచంద్రరావు, కర్రి బాలాజీ, గంధర్వ సుబ్రమణ్యం, నవరం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.500 ఇవ్వాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు ఆశ్రయ్య

పాలకోడేరు : ఉపాధి కూలీలకు కనీస వేతనం రూ.500 చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషపు ఆశ్రయ డిమాండ్ చేశారు. వేండ్ర గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల ప్రాంతాన్ని ఆయన సందర్శించి, కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీలు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం ఆశ్రయ మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసే విధానాల ప్రయత్నించడం దారుణమన్నారు. ఏడాదిలో వారందరికీ పనులు కల్పిస్తున్నామని చెబుతూనే అరకొరగా పనులు కల్పించడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. కనీసం 150 రోజులు పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ వేతనం అందించాలని చట్టం ఉన్నప్పటికీ అది అమలు కాకపోవడం దారుణం అన్నారు. రోజంతా కష్టపడిన రూ.250 కూడా రాని పరిస్థితి ఉందని, రోజుకి కనీసంగా రూ.500 కూలీ అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట లచ్చన్న, సత్యనారాయణ ఉన్నారు.

రాజశేఖరం గెలుపునకు కృషి చేయాలి

భీమవరం టౌన్ : తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని కూటమి నాయకులు సోమవారం భీమవరం పట్టణం 39, 38, 37 వార్డులలో నిర్వహించారు. ప్రచారంలో పాల్గొన్న భీమవరం ఎంఎల్ఎ, పిఎసి చైర్మన్ పులపర్తి రామాంజనేయులు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన డిఎస్‌సి నియామకాలను ఎంఎల్‌సి ఎన్నికల అనంతరం భర్తీ చేయనున్నామన్నారు. కూటమి నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, మెరగాని నారాయణమ్మ, పొత్తూరి బాపిరాజు పాల్గొన్నారు.

నరసాపురం : రాజశేఖరానికి భారీ మెజారిటీతో గెలిపించాలని కాపు కార్పొరేషన్ చైర్మన్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు అన్నారు. మండలంలోని గొంది, చిట్టవరం గ్రామాల్లో కూటమి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో కోపల్లి శ్రీను, చెన్నంశెట్టి నాగు, గంధి శ్రీను, రేవు ప్రభుదాస్ పాల్గొన్నారు.

తణుకు : రాజశేఖరంకి తొలి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ఏలూరులో జరిగిన రాజశేఖరం నామినేషన్ కార్యక్రమానికి కూటమి శ్రేణులు ర్యాలీగా బయలుదేరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదైన యువత సామాజిక సూరు శాతం కూటమి అభ్యర్థికి ఓటు వేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రంగూన్ దంత వైద్యుడు మృతి

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు పరిసర ప్రాంతాల్లో 60కి పైగా గ్రామాల ప్రజలకు మూడు తరాలుగా రంగూన్ దంత వైద్యంగా పేరుతో చిర కాలంగా వైద్య సేవలు అందిస్తున్న మార్టేరు తాతాజీ రంగూన్ దంత వైద్యులు దంగేటి గోపాలకృష్ణ(65) ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. పెనుగొండ-పాలకొల్లు రోడ్డులో మార్టేరు సెంటర్‌కు సమీపంలో ఉన్న హాస్పిటల్ మూసివేయడానికి ముందు నెగ్గారు రోడ్డు దాటి పాలమ్మదానికి వెళ్లిన క్రమంలో ఆచంట నుంచి ఏలూరు వెళ్తున్న మోటార్ సైకిల్ ఢీ కొట్టడంతో తీవ్రంగా ఆయన గాయపడ్డారు. వెంటనే స్థానికులు తణుకు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. పలువురు సంతాపం తెలిపారు.

దోమల మందు పిచికారీ

పెనుమంట్ర : ప్రస్తుతం దోమలు విపరీతంగా పెరిగిన కారణంగా మండలంలోని మార్టేరు గ్రామంలో పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం దోమల నివారణ మందు పిచికారీ చేశారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో ఉన్న కాల్వలు, చెత్త ప్రదేశాల్లో కాకుండా మురుగు పారే డ్రెయినేజీ పారిశుధ్య కార్మికులు సాయంతో ఈ పనులు చేపట్టి పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి మట్టా కుమారి రాము, ఉప సర్పంచి కర్రి వేణు బాబు, కార్యదర్శి సత్యనారాయణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు. పంచాయతీ చేపట్టిన ఈ పనుల పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బాల్య వివాహం అడ్డగింత

తాడేపల్లిగూడెం : స్థానిక వీకర్స్ కాలనీ ఒకటవ వార్డులో బాల్య వివాహం అడ్డుకున్నట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గా భవాని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నుంచి వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఆక్కడికి వెళ్లి విచారించగా బాలికకు అదే వార్డుకి చెందిన యువకుడితో వివాహం నిశ్చయమైందని, ఈనెల 20వ తేదీన వివాహం చేయబోతున్నట్లు నిర్ధరించినట్లు ఆమె తెలిపారు. వారికి చిన్న వయసులో వివాహం చేయడం వల్ల కలుగు అనర్థాల గురించి వివరించి, 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయవద్దని, అలా చేసినట్లు బాల్య వివాహ నిరోధక చట్టం ప్రకారం శిక్షార్హులని చెప్పి వారి నుంచి 18 సంవత్సరాలు నిండే వరకు వివాహం చేయమని స్టేట్‌మెంట్ తీసుకోవడం జరిగిందన్నారు. ఆ బాలికను తిరిగి స్కూల్లో జాయిన్ చేసేందుకు తగు చర్యలు తీసుకోవడమైందన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సిహెచ్.దుర్గ భవాని, మహిళా పోలీస్ విజయ కుమారి, అంగన్వాడీ టీచర్ వాని పాల్గొన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుని అరెస్ట్

6 మద్యం సీసాలు స్వాధీనం

ఆచంట : పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ నిర్వహించిన దాడులలో కొడమంచిలిలో ఎస్.వెంకట నారాయణను అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 6 మద్యం సీసాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. ఈ దాడులలో ఎస్ఐ జి.రఘు, పి.మహేష్, సిబ్బంది పాల్గొన్నారు. బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పాలకొల్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలియజేశారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పలుచోట్ల జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం

పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ



పెనుమంట్రలో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న వైద్యాధికారిణి

పెనుమంట్ర : మట్టి కణాల ద్వారా 1 నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు కలిగిన చిన్న, పెద్ద పిల్లల కడుపులో వ్యాపించే నులిపురుగుల్ని నిర్మూలన చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చుని మండల ఎంఇఒ-2 ఉంగరాల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ఆర్ఎ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలనా దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ లావణ్య, కనక ప్రియ, డాక్టర్ అనిల్ కుమార్, ప్రదీప్ కుమార్, డాక్టర్ మల్లిక, జావీద్ పాల్గొన్నారు.

గణపవరం : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం గణపవరం పిప్పర పిహెచ్‌సి పరిధిలోని అన్ని పాఠశాలలు, హైస్కూలు, కాలేజీ విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందచేసినట్లు డాక్టర్లు కె.ప్రియాంక, సంతోష్, కిరణ్మయి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నులిపురుగుల నివారణకు 5,926 మందికి మాత్రలు ఇవ్వవలసి ఉండగా 5,755 మందికి అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపిడిఒ ఆర్.బేబిశ్రీలక్ష్మి మాట్లాడారు. ఎంఇఒ జి.బాలయ్య, కమ్యూనిటీ హెల్త్ అధికారి విల్సన్ బాబు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవం సందర్భంగా సోమవారం కాలేజీలో 200 మంది విద్యార్థులకు మాత్రలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ సొసైటీ కో ఆర్డినేటర్ వెంకన్నబాబు, ఐక్యూ ఏసి కోఆర్డినేటర్ సిహెచ్.చైతన్య, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉండి : చిన్నారులు ఆరోగ్యంగా ఉండాలంటే నులిపురుగుల నివారణ తప్పనిసరి అని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ బి.సాయిచంద్ర, డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. మండలంలోని ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 10,829 మంది చిన్నారులకు 10,523 మందితో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగించినట్లు, మిగిలిన వారికి ఈనెల 17వ తేదీన అందజేస్తామని తెలిపారు. డాక్టర్ ఐసి.కీర్తన, డాక్టర్ పి.లక్ష్మి సునంద, ఉండి, యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల విస్తరణ అధికారులు కృష్ణకుమార్, రత్నరాజు పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రతి ఒక్కరూ నులిపురుగుల నివారణా మాత్రలు విధిగా వేసుకోవాలని ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాని సూచించారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పిహెచ్‌సి వైద్యులు దినేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల నివారణా మాత్రలు వేశారు. మండలంలోని విద్యార్థులకు 9,358 మందికి మాత్రలు పంపిణీ చేశాన్నారు. ఎంఇఒ యు.శామ్యూల్ జాన్, పిహెచ్‌సి వైద్యులు కె.లక్ష్మీపార్వతి ఉన్నారు.

తణుకు రూరల్ : జాతీయ నులిపురుగుల నివారణా దినోత్సవంలో భాగంగా తణుకు మండల పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు, వైద్యాధికారులు కిషోర్ కుమార్, సాయి భవాని ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణా మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. చేతులు శుభ్రం చేసుకోవడంలో అవలంబించే విధానాన్ని వివరించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సుమారు 9,355 మంది పిల్లలకి ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా పిల్లలందరి చేతులను కడిగించి, ఆపై భోజనం చేసిన 15 నిమిషాల తరువాత మాత్రలు వేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎస్.ఉదయలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పాలకోడేరు : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి, ఎప్పటికప్పుడు కాళ్లను, చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిఐఒ జిల్లా వ్యాధినిరోధక

మొగల్తూరులో..

శాఖాధికారి దేవసుధ, ఎంపిడిఒ రెడ్డియ్య అన్నారు. పాలకోడేరు జిల్లా పరిషత్ హైస్కూల్లో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమంలో భాగంగా డిఐఒ దేవసుధ, ఎంపిడిఒ రెడ్డియ్యలు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో వారు మాట్లాడుతూ హ్యాండ్ వాష్ గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలన్నారు. వారానికి ఒకసారి గోళ్లను కత్తిరించుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాలకోడేరు పిహెచ్‌సి వైద్యాధికారి సిహెచ్.రంగనాయుడు, డాక్టర్ స్వర్ణనిరంజని, సిహెచ్ఒ.సత్యనారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఆకివీడు : మండలంలోని పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలోని కాలింగిగూడెం ఎంపియుపి పాఠశాలలోని విద్యార్థులకు ఎంఎల్‌హెచ్‌పిఎస్ రామ తులసి, ఎఎన్ఎం జి.విజయలక్ష్మిలు ఈ మందులను పంపిణీ చేశారు. విద్యార్థులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ మాత్రలు పంపిణీ చేస్తుంటారు. వైద్య ఆరోగ్య శాఖ పిహెచ్‌సి పెదకాపవరం ఆధ్వర్యంలో మండలంలో అన్ని పాఠశాలల్లోనూ నులిపురుగు నివారణ ఆల్బెంజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రాంబాబు పాల్గొన్నారు.

కొడమంచిలి సొసైటీ మాజీ అధ్యక్షులు సత్యనారాయణ మృతి

ఆచంట : కొడమంచిలి సొసైటీ మాజీ అధ్యక్షులు, వైసిపి సీనియర్ నేత కాండ్రేగుల సత్యనారాయణ(63) సోమవారం ఉదయం అకాల మృతి చెందారు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆయన కుమారుడు మంగళగిరిలో సిఐగా పనిచేస్తున్నారు. ఈయన గతంలో కొడమంచిలి పంచాయతీ ఉపసర్పంచిగా పనిచేశారు. ఆయన మృతి వైసిపికి తీరని లోటని అన్నారు. మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాధరాజు సంతాపం తెలిపి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. మండల సర్పంచిల ఛాంబర్ అధ్యక్షులు సుంకర సీతారామ్, ఎంపిటిసిలు చిలుకూరి నాగ దుర్గభవాని, యల్లమెల్లి బేబీ రాజేష్, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్, వైసిపి నాయకులు సంతాపం తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తుల అరెస్ట్

తాడేపల్లిగూడెం: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు తాడేపల్లిగూడెం డిఎస్‌పి డి.విశ్వనాథ్ తెలిపారు. సోమవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడేపల్లిగూడెం రైల్వే గూడ్స్ షెడ్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించారు. ఒక వ్యక్తి తప్పించుకోగా ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,30 వేలు విలువ చేసే 13.288 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి నియంత్రణకు ఈగల్ అనే సంస్థను ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి విశ్వనాథ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ ఎ.సుబ్రహ్మణ్యం, ఎస్ఐలు బి.నాగరాజు, బాదం శ్రీను పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి - ఉండి

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల కలిగే అనర్థాల గురించి ఐసిడిఎస్ సిడిపిఒ వాణి విజయరత్నం ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీని ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిడిపిఒ వాణి విజయరత్నం మాట్లాడుతూ దేశంలో లింగ నిష్పత్తి ఆందోళనకరంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన బేటి బచావో బేటి పడావో కార్యక్రమం 10 సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. బాల్య వివాహాలు, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. అనాథ బాలలు, లింగ వివక్షత, కుటుంబంలో అనారోగ్య సమస్యలు, సాంప్రదాయాలు, ఆచారాల వల్ల బాల్య వివాహాలు జరగకుండా చూడాలని తెలియజేశారు. అదే విధంగా శిశుమరణాలు, మాతృ మరణాలు, పోషకాహార లోపం, రక్తహీనత, చదువు మధ్యలో ఆగిపోవడం, పుట్టిన పిల్లలలో లోపాలు ఉండడం, మహిళలు గృహ హింసకు గురి అవ్వడం, మహిళల అక్రమ రవాణా వంటి నష్టాలు

ఉండి : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ విజయరత్నం

జరుగుతాయని ఉమెన్ హెల్ప్ లైన్ 181కు ఫోన్ చేసి గృహహింసపై ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేయాలని, ఆడపిల్లలపై లైంగిక నేరాలు ఎక్కువ అవ్వడం, ఫోక్సో కేసులు పెరుగుతున్నాయని, ఎక్కడా అలాంటివి జరగకుండా ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అదేవిధంగా భేటీ బచావో బేటి పడావో కార్యక్రమానికి సంబంధించి ఆడపిల్లలు తనను తాను రక్షించుకునే విధానం గురించి చదువు యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. బేటి బచావో బేటి పడావో ప్రారంభించి 10 సంవత్సరాలు పూర్తవడంతో జనవరి 22 నుంచి మార్చి 8 వరకు 45 రోజుల పాటు వివిధ రూపాలలో ఈ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు మేరీ, సూర్య కుమారి, బాల కుమారి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : బాల్య వివాహాలు జరపడం చట్టరీత్యా నేరమని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఇ.విశాలాక్షి సూచించారు. తాడేపల్లిగూడెం ప్రాజెక్ట్ సిడిపిఒ టి.లక్ష్మి సరస్వతి ఆధ్వర్యంలో స్థానిక యాగర్లపల్లి 24వ వార్డులోని అంగన్వాడీ కేంద్రంలో కిశోర బాలికల తల్లులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లల పట్ల ఆడ, మగ వివక్షత చూపకూడదని, ప్రతీ ఆడపిల్ల చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలంటే తల్లి, తండ్రి, సమాజంలోని అందరూ వారికి అండగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.సుజాత, కె.ప్రసన్న, పిఎస్.సావిత్రి, ఎఎన్ఎం జయభారతి, బేబిరాణి, బాలికల తల్లులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, నరసాపురం మండలం, నరసాపురం మున్సిపల్ ఏరియా, 6వ వార్డు, జంపావారి వీధి, డోర్ నెం. 3-4-10 రు నివాసి మోచర్ల సత్యకృష్ణ గారి కుమార్తె మోచర్ల మైత్రి నాగ తన్మయ తెలియజేయునది ఏమనగా ది. 10-02-2025వ సం॥రం తేదీన I.E.L.S. Online Exam కొరకు విజయవాడ వెళ్ళుటకు నా తాలూకు సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ జిరాక్స్ తీయించుటకు మా ఇంటి వద్ద నుండి వెళ్తుండగా నా కవరులో నుండి నా తాలూకు **పాస్‌పోర్టు నెం. V4404121** ఎక్కడో పడిపోయినది. మార్గ మధ్యంలో ఎంత వెతికినను దొరకలేదు. కావున ఈ ప్రకటన ద్వారా నేను తెలియజేయునది ఏమనగా ఎవరికైనను నా పాస్‌పోర్ట్ దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలియజేయవలసినదిగా కోరుచున్నాను.

నరసాపురం, ది. 10-02-2025.

మోచర్ల మైత్రి నాగ తన్మయ
D/o. సత్యకృష్ణ
డోర్ నె. 3-4-10, జంపావారి వీధి
నియర్ రైతు బజార్
నరసాపురం - 534 275, ప.గో.జిల్లా.
మొబైల్ నెం: 98662 59514

రేషన్ షాప్ సీజ్

వీరవాసరం : బొబ్బనపల్లిలో రేషన్ డీలర్ ఎం.గంగాధర్‌కు చెందిన రేషన్‌షాపు నెం.0538014 నందు సరుకుల నిల్వలో వ్యత్యాసం ఉన్నందున ఆ షాపును సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లయ్ ఆర్ఐ సురేష్ సోమవారం తెలిపారు. ఏడు బస్తాల బియ్యం, యాభై పంచదార ప్యాకెట్‌లు, కందిపప్పు ప్యాకెట్‌లు నిల్వ రిజిస్టర్‌లో ఉండవలసిన దానికంటే తక్కువ ఉన్నట్టు తన పరిశీలనలో తేలిందని ఆర్ఐ అన్నారు. సదరు డీలరు ప్రతీ నెలా రేషన్ సరుకులు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు సరఫరా చేయకుండా ముందస్తుగానే రేషన్ సరుకులను పక్కదారి పట్టిస్తున్నట్టు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధులివ్వాలని వినతి

తాడేపల్లిగూడెం : ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నియోజకవర్గంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం కోసం, పెంటపాడు మండలం కెఎన్ రోడ్డు నుంచి బోడపాడు వరకు రోడ్డు నిర్మాణంకు రూ.కోటి 60 లక్షలు నిధుల మంజూరు చేయవలసిందిగా సోమవారం ముఖ్యమంత్రికి వినతి పత్రం అందజేసినట్లు తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఉన్నతాధికారులను నాబార్డు నిధులు విడుదల చేయవలసిందిగా ఆదేశించారు. అదేవిధంగా కోకో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ఇంటర్నేషనల్ మార్కెట్‌కు తగ్గట్టుగా రేటు కల్పించవలసిందిగా ముఖ్యమంత్రిని కోరగా అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి ఉన్నతాధికారులకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించినట్లు తెలిపారు. కొమ్ముగూడెంకు చెందిన కోకో రైతులు వట్టికూటి వెంకట రామారావు పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యాన హాట్ బాక్సులు అందజేత

ఆచంట : ఆచంట మానవత మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం నిమిత్తం రూ.9 వేలు విలువగల రెండు హాట్ బాక్స్‌లు(ఒక్కొక్కటి 30 లీటర్లు) అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కుక్కల లీలా ప్రసాద్, గౌరవ డైరెక్టర్ కొల్లేపర వెంకన్న బాబు, ఉపాధ్యక్షులు బొక్కా రామకృష్ణ, అడ్వైజరీ కమిటీ చైర్మన్ నంబూరి అంజిబాబు, కో చైర్మన్ వేండ్ర శ్రీనివాస్, సభ్యులు సజ్జా నారాయణ, ఆత్మీయ సహకార కమిటీ సభ్యులు మయూరి శర్మ, అభివృద్ధి కమిటీ చైర్మన్ గుండాబత్తుల ఆనంద్ కుమార్, సంస్థ కోశాధికారి తమ్మినీడి సత్యనారాయణమూర్తి, సహాయ కార్యదర్శి మానేపల్లి వెంకటేశ్వరరావు, సభ్యులు జగదీష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ నున్న శ్రీదేవి మాట్లాడుతూ మానవత సేవలను కొనియాడారు.

'శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు'

యలమంచిలి : మండలంలోని చించినాడ గ్రామంలో ఏటిగట్టుకు సమీపంలో గోదావరి షెడ్డును ఆనుకుని ఉన్న శ్మశాన స్థలాన్ని గ్రామానికి చెందిన ఒక రైతు ఆక్రమించుకొని పొక్లేనర్లు, ట్రాక్టర్లతో రొయ్యల చెరువును తవ్వుతున్నట్టు అందిన ఫిర్యాదు మేరకు సోమవారం ఆర్ఐ యశోద ఆ స్థలాన్ని పరిశీలించి జరుగుతున్న పనులను ఆపారు. ఈ సందర్భంగా దళిత నాయకులు కానేటి బాలరాజు, గొల్ల ఏడుకొండల శ్రీనివాస్, 8వ వార్డు మెంబర్ తెన్నేటి స్టాలిన్, స్థానిక నాయకులు ఆంజనేయులు, వెంకటస్వామి, మురాల రాజేష్ ఆర్ఐను కలిసి మాట్లాడుతూ రెండు చోట్ల షెడ్డును ఆనుకొని 72 సెంట్లు, దానికి మరికొంత దూరంలో ఒక రైతుకి చెందిన కొబ్బరి తోటలో మరొక 30 సెంట్లు ప్రభుత్వ భూమి ఉందని, వీటిని ఆ స్థల యజమాని తన ఆదీనంలో ఉంచుకొని రొయ్యల చెరువు తవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ భూమిని ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకుని గ్రామంలోని దళితులకు, ప్రజలకు శాశ్వత శ్మశాన స్థలంగా కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఆర్ఐ యశోద మాట్లాడుతూ.. ఆ భూమి పూర్వపరాలు పరిశీలించి ఉన్నతాధికారులకు రిపోర్టు ఇస్తానని తెలిపారు.



ఆర్ఐకు శ్మశాన సమస్యను వివరిస్తున్న నాయకులు

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

లూథరన్ హైస్కూల్ విద్యార్థులకు కంచాలు, గ్లాసులు అందజేత

భీమవరం టౌన్ : ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రభుత్వం చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని, ప్రతిఒక్కరూ స్టీల్ గ్లాస్‌లు, ప్లేట్స్ మాత్రమే వాడాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ రీజనల్ మేనేజర్లు వెంకన్న బాబు, రామకృష్ణ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో భీమవరం లూథరన్ హైస్కూల్లోని 120 మంది విద్యార్థులకు దాతల సహకారంతో 120 స్టీల్ గ్లాస్‌లు, 120 కంచాలను సోమవారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం జిల్లాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారని, 10 రోజులుగా పట్టణంలో ప్లాస్టిక్ నిషేదం జరుగుతుందని, ప్రజల్లో కూడా మార్పు రావాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. పట్టణానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు కోటిపల్లి సాయి పార్థసారథి సహకారంతో 120 స్టీల్ గ్లాస్, 120 కంచాలను అందించామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం మణి రాజు, పిఇటి ప్రసన్న, కొడపల్లి నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు, గ్లాసులు అందజేస్తున్న దాతలు

నూరుశాతం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలి

మున్సిపల్ కమిషనర్ అంజయ్య

నరసాపురం: పట్టణంలో నూరుశాతం పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో కమిషనర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ అంజయ్య మాట్లాడుతూ గడువు ముగుస్తున్న తరుణంలో చెల్లింపులు సకాలంలో లేకపోతే పురపాలకంగా చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. పట్టణంలోని అన్ని వార్డులకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పన్ను వసూళ్లను వేగవంతం చేశామన్నారు. అందులో భాగంగా పన్ను వసూళ్ల విషయమై వార్డు, సచివాలయ సిబ్బందికి అవగాహనతో పాటు ఆస్తిపన్ను, తాగునీటి పన్ను వసూళ్ల వేగం పెంచాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పారిశుధ్య పనులపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి రోజు డ్రెయినేజీ శుభ్రం చేసే పనులను చేపట్టామని చెప్పారు. మురుగు నీరు లేకుండా చేయడం వల్ల దోమల సమస్య రాదని, ప్రజలు అంటు రోగాల బారిన పడకుండా ఉంటారని తెలిపారు. డ్రెయినేజీలలో చెత్తాచెదారం, కాగితాలు, ప్లాస్టిక్ కవర్లు వేయకుండా ఉండాల్సిన బాధ్యత స్థానికులపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్ వినియోగించుకోవాలి : ఆర్‌డిఒ

పాలకొల్లు : రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ వాడకం వల్ల భవిష్యత్తులో విద్యుత్ సంక్షోభం వచ్చే అవకాశం ఉందని, దీనిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ సోలార్ పవర్ సద్వినియోగం చేసుకోవాలని నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు కోరారు. పాలకొల్లు రూరల్ పంచాయతీ వద్ద సోమవారం విద్యుత్ సోలార్ వాడకంపై జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. 30 సంవత్సరాల పాటు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గృహస్థుడు సోలార్ ప్లేట్లను తమ ఇండ్ల వద్ద వేసుకొని రాబోయే సంక్షోభం నుంచి గట్టెక్కాలని కోరారు. విద్యుత్ శాఖ ఎస్ఇ రఘునాథ్ బాబు మాట్లాడుతూ సోలార్ పవర్‌కు పెట్టుబడి ఎక్కువగా కనిపించినా సబ్సిడీ ఉంటుందన్నారు. విద్యుత్ శాఖ ఇఇ మధు కుమార్, డిఇ రాంబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసాపురం ఆర్‌డిఒ దాసిరాజు

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం 2వ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, తాడేపల్లిగూడెం

ఇ.పి.నెం.9/2024 ఇన్ ఓ.ఎస్.నెం.212/2022

బిట్వీన్:
రెడ్డి సత్యనారాయణ ...డి. హెచ్.ఆర్ /ప్లెయింటిఫ్
మద్దుకూరి నాగేశ్వరరావు ...జె.డి.ఆర్ /డిఫెండెంట్

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఆస్థి వేలం ప్రకటన

పై నెంబరు డిక్రీ బాకీ గాను ప్రతివాది /జె.డి.ఆర్ తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది. 20-02-2025 వ తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయతు పై కోర్టులో వేలం వేయబడును.** షరతులు తెలుసుకొని పాడుకొనవలెను.

షెడ్యూలు: పశ్చిమ గోదావరి జిల్లా, తాడేపల్లిగూడెం మండలం, జగన్నాధపురం గ్రామం తాలూకు వ్యవసాయ భూమి bearing R.S.No.115 to an extent of Ac.0-60 Cents of Agriculture land bounded by:
East: Talla Venkateswarao's Land.
South: Maddhukuri Ramarao's Land.
West: Land of Siddhina Sirisha.
North: Siddhina Venkataswararao's Land. & Etc., Land.

పై హద్దుల మధ్య య.0-60 సెంట్లు గల వ్యవసాయ భూమి సమస్త ఈజుమెంటు హక్కులతో సహా.
వాది /డి.హెచ్.ఆర్ వాల్యూ /కిమ్మత్తు : రూ.10,00,000/-
అమీనా వాల్యూ /కిమ్మత్తు : రూ.20,00,000/-

MUTYALA SUNIL KUMAR
Advocate for D.H.R.
Tadepalligude.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, నరసాపురం

F.D.I.A. No. 06/2021 in O.S. No. 68/2018

బిట్విన్:
గాదె వెంకట శివరామ్ ...పిటీషనర్
అండ్
పిల్లా హేమలత ...రెస్పాండెంట్

రెస్పాండెంటుకు నోటీసులు:
పిల్లా హేమలత, W/o. నర్సింహరావు, డోర్ నెం. 1-26, అడవిపాలెం, యలమంచిలి మండలం, ప॥గో॥జిల్లా.

మీరు పిటీషనర్ గాది వెంకట శివరామ్ గారికి చెల్లించవలసిన బాకీ, చెల్లించనందున మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) నరసాపురం వారి కోర్టులో పై నెంబరు వ్యాజ్యము దాఖలు చేసియున్నారు. సదరు వ్యాజ్యములో శ్రీ కోర్టు వారి ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా నోటీసులు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది. 20-02-2025 సం॥రం తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున సదరు వ్యాజ్యము విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియచేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, న్యాయవాది
3-4-10, జంపావారి వీధి
నరసాపురం నరసాపురం-534275, ప॥గో॥జిల్లా
ది. 10-02-2024 సెల్: 98662 59514

ప్రకటన

మహారాజశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం 10వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

A.S.No.8/2020

Between:
సాకా మోహనరావు ...అప్పిలెంట్
మరియు
సాకా నారాయణరావు వగైరా ...రెస్పాండెంట్లు

టు:
6వ రెస్పాండెంట్: శ్రీమతి గొల్ల రాజమణి, భర్త: హేమ చంద్రబాబు, C/o. జాన్ ఫ్రెడ్రిక్, మట్లపాలెం, వయా దొడ్డిపట్ల, యలమంచిలి మండలం, ప.గో.జిల్లా

పై నంబరు అప్పీలులో 6వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు సమన్లు పంపించిననూ మీరు అందుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా పై నంబరు అప్పీలు మీ హాజరు నిమిత్తం **తేది. 24-02-2025 సం.రం. తేదీ** నాటికి వాయిదా అయి వున్నది. సదరు తేదీ నాడు మీరు స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట **ఉదయం 10-30 గంటలకు** పై హాజరై సంజాయిషీ తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున అప్పీలు తీర్మానం చేయబడునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

పోలిశెట్టి వీర వెంకట నారాయణ స్వామి
నరసాపురం అడ్వకేట్
ది. 09-2-2025 నరసాపురం, ప.గో.జిలా
సెల్ నెం. 98660 94606